## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



**వేలేరు :** మండలంలోని కన్నారం, ఇచ్చుకపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మిట్టపెల్లి వెంకటరెడ్డి, కొలుగూరి మల్లయ్య కుటుంబాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

### యాదగిరి జన్మదినం



**వేలేరు :** 'కుడా' మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి జన్మదిన వేడుకలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్స్, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రమౌళి, మహిపాల్, శ్రీనివాస్, సునీల్, నాగరాజు, శ్రవణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### పీఏసీఎస్‌లో రెండో రోజు తనిఖీలు



**శాయంపేట:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రెండో రోజు అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. తనకు తెలియకుండానే పంట రుణాలు పెంచి రాయడంతో రుణమాఫీ కాలేదని మాజీ సర్పంచ్ కందగట్ల రవి డీసీఓకు ఫిర్యాదు చేశారు. డీసీఓ ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాధిక, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అఫ్జల్ పీఏసీఎస్‌లో రికార్డులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. తనిఖీలు పూర్తిచేసిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని వారు తెలిపారు. డీసీసీబీ సీఈఓ వజీర్‌సుల్తాన్, డీసీసీబీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ హరిత, సీఈఓ రాజమోహన్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు.

### స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**నర్సంపేట :** స్థానికులకు నర్సంపేటలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూలక్క, వెంకటస్వామి మాట్లాడారు. పీజీలు, డిగ్రీలు పూర్తిచేసి ఉద్యోగాలు లభించక ఇబ్బంది పడుతున్న స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో కళాశాల ప్రిన్సిపాల్, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు దళారులు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వమే నేరుగా నోటిఫికేషన్ ఇచ్చి అర్హులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంధ్య, సుకన్య, శిరీష, అఖిల, లక్ష్మి, రాజు, నరేశ్, రవళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

### 26 నుంచి సైన్స్ మేళా

**దుగ్గొండి :** జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26, 28 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ మేళా, యువజనోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ఆసక్తి కలిగిన యువత, విద్యార్థులు ఈనెల 26లోగా మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీఓ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 26న వరంగల్‌లోని ఏవీవీ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి సైన్స్ మేళా, 28న పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో జిల్లాస్థాయి యువ కళాకారులకు వివిధ రంగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 29 ఏళ్ల వరకు వయస్సున్న విద్యార్థులు, యువత జానపద నృత్యాలు, జానపద గీతాలు, కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలు, నూతన ప్రాజెక్టులు, ఆవిష్కరణలు చేసిన యువత, విద్యార్థులు సెల్ నంబర్ 7702155096కు వివరాలు వాట్సప్ చేయాలని సూచించారు

### వాహనాలను నిలపొద్దు

**రాయపర్తి :** మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలను నిలపొద్దని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# డిజిటల్ తరగతులు డీలా

- నిరుపయోగంగా కంప్యూటర్లు
- సాంకేతికత విద్యకు దూరమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



పాఠశాల గదిలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు

**పరకాల :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఏనిమిదేళ్లగా కంప్యూటర్ విద్యకు దూరమవుతున్నారు. కంప్యూటర్ తరగతులు బోధించేందుకు కంప్యూటర్ శిక్షకులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. పాఠశాల ఉపాధ్యాయులే కంప్యూటర్ తరగతులు బోధించాలని గత ప్రభుత్వాలు ఆదేశించడంతో విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షలా మారింది. ఓ వైపు ప్రైవేటు పాఠశాలలు డిజిటల్ తరగతులతో విద్యార్థులను సంకేతికత వైపు మళ్లిస్తుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో మూలకు పడిన కంప్యూటర్లను కనీసం వినియోగించి విద్యార్థులకు కంప్యూటర్ బోధనను చేరువచేయలేకపోతుందని విమర్శలు వస్తున్నాయి. కేవలం పుస్తకంలో ఉన్న కంప్యూటర్ విద్య గురించి వివరించటం తప్పా కంప్యూటర్ శిక్షణ ఇవ్వడంలో విఫలం అవుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కొరతతో మరింత నిరుపయోగంగా మారిందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శిక్షకులను నియమించాలి**

ప్రభుత్వ పాఠశాలలకు అందించిన కంప్యూటర్లు ప్రస్తుతం విద్యార్థులకు అందించాల్సిన కంప్యూటర్ బోధనకు అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానానికి దూరమవుతున్నారని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, డ్రైవ్‌లు లేకపోవడం, డ్రైవ్‌లు లాక్ చేయడం, హార్డ్‌డిస్క్‌లో స్పేస్ కొరత ఉందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. మరమ్మతుకు వచ్చిన కంప్యూటర్లను బాగు చేసేందుకు సొంత ఖర్చులు భరించాల్సి వస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకొని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు శిక్షకులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## విద్యార్థులు సమాజ అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

**పరకాల :** విద్యార్థులు సామాజిక సేవతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమాజభివృద్ధికి పాడుపడాలని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని, యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. చదువుతో పాటు సమాజంలో జరిగే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సర్దార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి

ఎంపీడీఓ ఆంజనేయులు



**పరకాల :** ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పరకాల, నడికూడ మండలాల పరిధిలోని 24 గ్రామాల మంచినీటి సహాయకులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందిన చంద్రశేఖర్ ద్వారా పైపులైన్ లీకేజీ, మరమ్మతులు, రిప్లేస్‌మెంట్‌పై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుకుమార్, ఏఈ రమణయ్య, ఎపీఓ ఇమ్మడి భాస్కర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడి నియామకం

**పరకాల :** కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పాలకుర్తి శ్రీనివాస్‌ను నియమిస్తూ ఎస్టీ సెల్ చైర్మన్ గుగులోతు రవీంద్ర నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ప్రతీఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**మరో ఇద్దరికి గాయాలు**



సాంబయ్య (ఫైల్)

**కమలాపూర్ :** మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పుల్ల సాంబయ్య (48), జన్ను భిక్షపతితో కలిసి పొలం పనుల నిమిత్తం (టీఎస్ 02 ఈప 0407) నంబరు గల ద్విచక్రవాహనంపై వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి తిరిగి వస్తూ స్థానిక వెనిశెట్టి పున్నంచందర్ ట్రావెల్స్ సమీపంలో ఆగారు. అదే సమయంలో పరకాల నుంచి మండల కేంద్రానికి వస్తున్న ఎల్కతుర్తి మండలం వల్బాపూర్‌కు చెందిన పోతిరెడ్డి మనోజ్ అనే వ్యక్తి (ఏపీ 10 ఏఎక్స్ 2820) నంబరు గల పల్సర్ ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఆగిఉన్న సాంబయ్య ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో పుల్ల సాంబయ్య, జన్ను భిక్షపతికి తీవ్ర గాయాలు కాగా మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే సాంబయ్యను 108 ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తీవ్ర గాయాలైన భిక్షపతిని ఓ ప్రైవేట్ వాహనం ద్వారా, స్వల్ప గాయాలైన మనోజ్‌ను 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరు వరంగల్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుడు సాంబయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్య మల్లికాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ వెల్లడించారు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి



అరవింద్ (ఫైల్)

**ధర్మసాగర్ :** విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ముప్పారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారం గ్రామానికి చెందిన చిట్యాల అరవింద్ (19) సోమవారం సాయంత్రం బట్టలు ఇస్త్రీ చేసుకుందామని ఐరన్‌బాక్స్ ప్లగ్ బోర్డులో పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి చిట్యాల లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

### పిడుగుపాటుతో గేదె మృతి



**పరకాల :** మండలంలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సీతారాంపూర్‌లో పిడుగుపాటుతో గేదె మృతిచెందింది. నల్లెల కుమారస్వామి అనే రైతు ఇంటిముందు వేపచెట్టుపై పిడుగుపడటంతో చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో చెట్టుకు కట్టేసిన గేదె ప్రాణాలు కోల్పోయింది. రూ.70 వేల విలువ చేసే గేదె మృతిచెందడంతో రైతు కన్నీరు పెట్టుకున్నాడు. బాధిత రైతును మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి పరామర్శించారు. ప్రభుత్వం తరుపున ఆదుకునేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

## 'ఆకాశవాణి కదంబ' లో విద్యార్థుల సందడి



పాట పాడుతున్న విద్యార్థులు

**దుగ్గొండి :** వరంగల్‌లోని ఆకాశవాణి కేంద్రంలో 'చిన్నారిలోకం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం నిర్వహించిన 'కదంబ' కార్యక్రమంలో మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి విద్యార్థిని సమన్విత యాంకర్‌గా వ్యవహరించగా విద్యార్థులు జ్యోతి, అక్షిత, నికిత, కరుణశ్రీ, లాస్య, లిఖిత, తేజశ్రీ, అస్మిత, వర్షిణి కవితలు, కథలు చెప్పారు. పాటలు పాడారు. విద్యావ్యాసాలు వినిపించారు. ప్రతిభ చాటి అలరించారు. ఆహూతులను ఆకట్టుకున్నార. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మాట్లాడారు. గైడ్ టీచర్‌గా చిలువేరు శ్రీనివాసులు వ్యవరించారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సారయ్య, రఘు, స్వప్న, వేణుగోపాల్ అభినందించారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత కీలకం



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

**దుగ్గొండి :** మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం కీలకమని తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ లెక్కల అరుంధతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని వారు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం, కూరలను ప్రత్యక్షంగా రుచి చూశారు. అనంతరం నిర్వాహకులకు సూచనలు పలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన శాంపిల్ తీసి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా నిల్వ చేసిన టేకు కర్రను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని తెలిసిందని, వారిని గుర్తించి కేసులు నమోదు చేయిస్తామని చెప్పారు.

## టీఎంఎస్ మండల కన్వీనర్‌గా అమరేందర్

**వర్ధన్నపేట :** మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన మంద అమరేందర్‌ను తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) మండల కన్వీనర్‌గా నియమించినట్లు జిల్లా కన్వీనర్ తాటికాయల వివేకానంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతీఒక్కరికి అమరేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## హక్కుల సాధనలో మహిళలు ముందుండాలి

- సర్వోదయ యూత్ కార్యదర్శి దామోదర్



మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

**ఆత్మకూరు :** మహిళలు హక్కులు సాధించుకున్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందని సర్వోదయ యూత్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సహాయక కమిటీల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పటికీ తమకు వచ్చే సమస్యను చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఎన్నో చట్టాలు, వ్యవస్థలు ఉన్నాయని తెలిపారు. సర్వోదయ సంస్థ గ్రామస్థాయిలో 9మందితో కమిటీలను ఏర్పాటు చేసి మహిళ సమస్యలపై పనిచేసే విధంగా శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. మహిళా హక్కులపై ప్రతిఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. సీడీపీఓ స్వాతి, ఏసీడీపీఓ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ పద్మావతి, సీసీ శ్యామ్సన్, సభ్యులు ఇందిరా, రవీందర్, మహిళలు పాల్గొన్నారు.

## పేదలకు సాయం చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న మంజుల

**ధర్మసాగర్ :** పేదలకు సాయం అందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. కష్టంతో ఎదిగిన వారు పేదవారి బాగోగులను పట్టించుకోవాలనే గాంధీజీ, వివేకానందస్వామి మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఎన్ఎస్ఎస్ విద్యా సంస్థ ఆవిర్భావించిందని తెలిపారు. విద్యార్థులు చదువులో ముందుండడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్పంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం, మూఢనమ్మకాల నిర్మూలనలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముందుండి అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆజం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాబురావు, వెంకట్, గణేశ్, రాములు, గోపాలకృష్ణ, ప్రభాకర్, రాజేందర్, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



చెట్టుకొమ్మలకు ఆనుకుని ఉన్న విద్యుత్ వైర్లు

**శాయంపేట :** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో చెట్లను ఆనుకొని విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యార్థులు బట్టలు ఆరబెట్టుకునేందుకు చెట్లకు తాళ్లు కట్టుకుంటున్నారు. ఈ క్రమంలో వర్షం పడితే విద్యార్థులు కరెంట్‌షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఈదురుగాలులతో భారీ వర్షం పడితే విద్యుత్ తీగలపై కొమ్మలు విరిగి పడి విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉందని, విద్యుత్‌శాఖ అధికారలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలోని తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ప్రభాకర్‌తోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న దిలీప్

**వేలేరు :** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని యూత్ కాంగ్రెస్ నాయకుడు నలివెల దిలీప్ అన్నారు. మంగళవారం ఎర్రబెల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.60 కోట్లు కేటాయిస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేయించిన ఘనత రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కే దక్కుతుందని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గానికి చేసింది శూన్యమని విమర్శించారు. అలాగే హవల్దార్ పల్లి నుంచి ఎర్రబెల్లి గ్రామానికి రూ.37 లక్షల నిధులు కేటాయించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెల రుపురేఖలు మారబోతున్నాయని ఆయన అన్నారు.

# 10 కానిదే రారు.. 4 తర్వాత ఉండరు..!

- సమయపాలన పాటించని వైద్య సిబ్బంది
- రోగుల పడిగాపులు
- ఉన్నతాధికారులు స్పందించాలని పలువురి విజ్ఞప్తి



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**శాయంపేట :** ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయి అధికారులు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని రోగులు ఆగ్రహిస్తున్నారు. వైద్య సిబ్బంది కొరతతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో ఉదయం 9 గంటలకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 9.35 గంటలకు డాక్టర్ సాయికృష్ణ రాగా మిగిత సిబ్బంది విధులకు హాజరు కాలేదని రోగులు తెలిపారు.

**పేరుకే 24 గంటల వైద్యం..**

పేరుకే 24 గంటలు వైద్యసేవలు అందించే ఆస్పత్రి అని, సిబ్బంది కొరత వెంటాడడంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే వైద్యసేవలు అందుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇంతే కాకుండా మండలంలోని సబ్ సెంటర్‌లలో కూడా సమయానికి ఎవరు అందుబాటులో ఉండడంలేదని మండల ప్రజలు అంటున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులలో వృద్ధులు, బీపీ, షుగర్, డయాబెటీస్ రోగులు ఉదయం నుంచి వైద్య సిబ్బంది కోసం పడిగాపులు కాస్తున్నరాని, షుగర్ పేషెంట్లు పరీక్షల నిమిత్తం ఉదయం నుంచి ఆహారం తీసుకోకుండా ఆసుపత్రికి వస్తే సిబ్బంది లేకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు షుగర్ పేషెంట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని సకాలంలో డాక్టర్లు, సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వైద్య సేవలు సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తెరుచుకోని మెడికల్ ఆఫీసర్ రూం తలుపులు



9.35 గంటలు కావస్తున్న విధులకు హాజరుకాని వైద్య సిబ్బంది



సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న పేషెంట్లు

## సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం



**పర్వతగిరి :** సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బలం పెరిగి అధికారం చేజిక్కించుకోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రనూ పోషించలేకపోతోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముత్తిరెడ్డి కేశవరెడ్డి, పట్టాపురం ఏకాంతం గౌడ్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, స్థానిక నాయకుడు బొట్ల మధు, తదితరులు పాల్గొన్నారు.